అపూర్వం.. అద్భుతం

సేవా కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు

- రూ 1.20 లక్షలతో బస్టాండ్ నిర్మాణం
- పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు
- శభాష్ అంటున్న గ్రామస్తులు



సింగూరులో పూర్వ విద్యార్థులు నిర్మించిన బస్టాండ్

పుల్‌కల్(అందోల్): పూర్వ విద్యార్థులంతా ఏకమయ్యారు. విందు వినోదాలతో కాలక్షేపం చేయకుండా తాముంటున్న గ్రామానికి, చదివిన పాఠశాలకు చేతనైన సాయం చేయాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆలోచనలకు పదును పెట్టారు. గ్రామానికి ఏం కావాలో ఆలోచించారు. ముందుగా ప్రయాణికులకు నీడనిచ్చే బస్టాండ్ నిర్మించి, పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించారు. పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ఉన్నత పాఠశాల 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా, గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు.

తీరిన ప్రయాణికుల వెతలు

సింగూరు గ్రామానికి నాలుగు దశాబ్దాల నుంచి ఆర్టీసీ బస్సు నడుస్తున్నా ప్రయాణికులకు బస్టాండ్ సౌకర్యం లేదు. దీంతో ప్రయాణికులు ఎండలో, వానలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఈ సమయంలో పూర్వ విద్యార్థులు ఏకమై రూ 1.20 లక్షలతో బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రయాణికులకు నీడ కల్పించారు.

పాఠశాలలో మౌలిక వసతులు

తాము విద్యాబుద్ధులు నేర్చిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు సరఫరా చేశారు. మధ్యాహ్న భోజనానికి ప్లేట్‌లను పంపిణీ చేశారు. హనుమాన్ గుడిలో మైక్‌సెట్‌ను అమర్చారు. అలాగే.. ధార్మిక కార్యక్రమాలే కాకుండా పలు సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు గ్రామస్తులు ఫిదా అవుతున్నారు.

సేవా కార్యక్రమాలు చేస్తాం



ఏటా పూర్వ విద్యార్థులందరం కలిసి గ్రామానికి సేవా చేయాలని నిర్ణయించాం. వినోదాలతో కాలక్షేపం చేయకుండా రాజకీయాలకతీతంగా గ్రామానికి, పాఠశాలకు ఏదో ఒక పని చేయాలని నిర్ణయించుకుంటాం. మా బ్యాచ్‌లో 15 అబ్బాయిలం, 17 మంది అమ్మాయిలం ఉన్నాం. అమ్మాయిల భర్తల సహకారం కూడా తీసుకుంటాం.

– కుమ్మరి వీరేశం

ప్రయాణికులకు నీడ నిచ్చాం



పూర్వ విద్యార్థులందరం కలిసి గ్రామాల్లో మౌలిక సౌకర్యాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించాం. రూ 1.20 లక్షలతో బస్టాండ్ నిర్మించి నాలుగు దశాబ్దాల కల నెరవేర్చాం. నిలువ నీడ లేని ప్రయాణికులకు నీడనిచ్చామన్న తృప్తి కలిగింది. రాబోయే రోజుల్లో స్నేహితులమంతా కలిసి మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం.

– గడీల మల్లేశం

క్లుప్తంగా

దత్తగిరిలో ఎంపీ పూజలు


దత్తగిరిలో ఆశ్రమ పీఠాధిపతులతో ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆశ్రమానికి వచ్చిన ఆయనకు ఆశ్రమ పీఠాధిపతులు, అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వర స్వామిలు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనతంరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ సమరభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుగౌడ్

సంగారెడ్డి: హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఈ 25న జరగనున్న బీసీ సమరభేరి వాల్‌పోస్టర్‌ను ఆ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని కులాల సంఘాల నాయకులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ సమరభేరికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలి


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సంగారెడ్డి టౌన్: డాటా ఎంట్రీలో పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో కుటుంబాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తప్పుడు లేకుండా ఎంట్రీ చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. గ్రామాలలో కుటుంబ సర్వే కొనసాగుతోందని, ఈనెల 30 వరకు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గం


అబ్బాస్ అలీని సన్మానించిన ఫీల్డ్ అసిసెంట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉపాధి హామీ పథకం మండల ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అబ్బాస్ అలీ, ఉపాధ్యక్షుడిగా వైజ్యనాథ్, ప్రధాన కార్యదర్శిగా విఠల్, కోశాధికారిగా సుకుమార్, కమిటీ సభ్యులుగా రాజు, అప్పన్న, భీమాంజనేయులు, అనుషమ్మ, సోనియా, రేణుక, మార్తా, మహానంద, అనీల్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సభ్యులను ఘనంగా సన్మానించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు అబ్బాస్ అలీ తెలిపారు.

ఆస్పత్రిలో ఫైర్‌సేఫ్టీపై అవగాహన

సంగారెడ్డి: రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ శుక్రవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. కమిటీ సభ్యులు డాక్టర్ సుధీర, డాక్టర్ జిగీషా ఆస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదం నివారణపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకు ముందు మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, ఆర్ఎంఓ వీరాంజనేయులు, రవికుమార్ డైటీషియన్ బాలస్వామి పాల్గొనున్నారు.

పకడ్బందీగా ఆన్‌లైన్ ప్రక్రియ

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ,కుల గణన సర్వే ఫాంలు పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రం కంగ్టిలో శుక్రవారం ఆయన శిక్షణ పొందిన ఆపరేటర్లు చేస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియ సరళిని పరిశీలించారు. సర్వేలోని అన్ని అంశాలను క్రోడీకరించి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు.

ప్రమాదం అంచుల్లో ప్రయాణం


వాహనంలో సామగ్రిని పట్టుకొని ఉన్న యువకుడు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలో పలువురు వాహనదారులు సరుకులను ఇష్టారీతిన రవాణా చేస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా ప్రైవేట్ వాహనదారులు నిబంధనలు గాలికి వదిలి తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ మితిమీరిన వేగంతో వాహనాలను నియంత్రించలేక ప్రమాదాలకు గురువుతున్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ప్రధాన రహదారిపై డీసీఎం వాహనంలో ఓ యువకుడు టెంట్ సామాన్లను పట్టుకొని ఉన్నాడు. ఏ చిన్న పొరపాటు జరిగినా తనతో పాటు రోడ్డుపై వెళ్లేవారికి ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. నిబంధనలు పాటించేలా ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపాలిటీలో సర్వే నత్తనడక


సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి భిక్షపతి

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే గ్రామాల్లో చకచకా కొనసాగుతున్నా.. మున్సిపాలిటిలో నత్తనడకన సాగుతోంది. మండలంలో 22 గ్రామ పంచాయతీలకు గాను 10970 నివాసాల్లో సర్వే చేపట్టాలి. గురువారం నాటికి మండలంలో 8,715 నివాసాల్లో సర్వే పూర్తి చేశారు. ఇప్పటి వరకు మండలంలో 85 శాతం సర్వే పూర్తి అయింది. మున్సిపాలిటీలో సర్వే నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు 40 శాతం వరకే సర్వే జరిగింది. ఇదిలాఉంటే నిర్ణత గడువులోపు సర్వే పూర్తి చేస్తామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

పోషకాహారం సక్రమంగా అందించాలి


కంగ్టి: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుజాత

కంగ్టి(నారాయణఖేడ్): అంగన్‌వాడి సెంటర్లలో పిల్లల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారం సకాలంలో సక్రమంగా అందించాలని సూపర్‌వైజర్ సుజాత ఆదేశించారు. కంగ్టి మండలం తడ్కల్‌లోని మూడవ సెంటర్‌ను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని పలు రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుదలకు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ ప్రేమల, ఆయమ్మ లలిత, పిల్లలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చంద్రారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం బొల్లారం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సతీష్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నివసిస్తున్న పేదకు మమత ఆసుపత్రి ఆధ్వర్యంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాలమ్మ, కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి స్థానిక నాయకులు రమణయ్య పరుశురాం చక్రపాణి, ఉద్యానంద్ శేఖర్ తివారి, వైద్య సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాకారుల ప్రదర్శన

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని చేర్యాల, చిమ్నా పూర్, కంది గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై శుక్రవారం కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. డీఎల్పీఓ అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మాజీ ఎంపీపీ ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు

డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి


రోగులతో మాట్లాడుతున్న సంగారెడ్డి

జోగిపేట(అందోల్): ప్రభుత్వ దవాఖానాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని డీసీహెచ్ఎస్ సంగారెడ్డి అన్నారు. ఆయన జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఫార్మాసిస్టులు కూడా బాధ్యతతో వ్యవహరించాలని, మందుల కొరత లేదని చెప్పారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, డాక్టర్లు సిద్ధార్థ, నాగలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వంట గదుల్లో శుభ్రత అవసరం

ఎంఈఓ అంజయ్య


వంట గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ అంజయ్య

రాయికోడ్(అందోల్): వసతి గృహాల్లోని వంట గదులను శుభ్రంగా ఉండేలా చూడాలని మండల విద్యాధికారి వి.అంజయ్య ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రం రాయికోడ్‌లోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం, అల్లాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఆయా పాఠశాల, కళాశాలలకు చెందిన వంట గదులను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, విధిగా మెనూ పాటించాలని ఆదేశించారు. బోధనతోపాటు విద్యార్థుల ఆరోగ్యభద్రత కూడా ముఖ్యమేనని, వారు వ్యాధుల బారిన పడకుండా చూడాలని చెప్పారు. అనంతరం జంమ్గి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో రాయికోడ్ పీఎస్ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ


విరాళాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: సీపీఎం రాష్ట్ర మహాసభల కోసం పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలో విరాళాలను సేకరించారు. పార్టీ నాయకులు మహిపాల్ ఆధ్వర్యంలో పట్టణంలో తిరుగుతూ విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25 నుంచి మూడు రోజుల పాటు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు.

గృహిణి అదృశ్యం


రేణుక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గృహిణి అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొమరంభీం కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన రేణుకకు టేక్మాల్‌కు చెందిన గణేష్‌తో ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. కాగా తల్లిదండ్రులకు తోడు ఎవరూ లేరని కొన్ని రోజులు పుట్టింటి వద్ద ఉంటానని భర్తకు తెలిపింది. దీంతో వారం రోజుల క్రితం పుట్టింటికి వచ్చి ఇళ్లలో పని చేస్తుంది. శుక్రవారం ఉదయం ఇంటిలో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి శ్రీరాములు శుక్రవారం రాత్రి కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

2.11 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు కుట్ర

- ఫోర్జరీ కేసులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అరెస్టు
- ఎస్ఐ పాండు


నిందితుడిని చూపుతున్న ఎస్ఐ పాండు

జోగిపేట(అందోల్): ప్రభుత్వ భూమిని కాజేసేందుకు గెజిటెడ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణంపై కేసు నమోదైంది. ఎస్ఐ పాండు శుక్రవారం వివరాలు వెల్లడించారు. అందోలు శివారులోని సర్వే నంబర్ 217లో 2.11 భూమిని కాజేసేందుకు చేసిన కుట్రలు బయటపడ్డాయన్నారు. డీబీ రాములు సెప్టెంబర్ 15, 2023న మరణించగా అతడి పేరు మీద ఏప్రిల్ 1, 2024న టీఎం 33కింద ధరణి పోర్టల్‌లో భూమి మిస్సింగ్ అయినట్లుగా దరఖాస్తు చేసుకున్నారు. అప్పుటి ఇన్‌చార్జి తహసీల్దారు మధుకర్ రెడ్డి దరఖాస్తును పరిశీలించి రైతు వారీ పట్టా ధ్రువపత్రం సమర్పించాలని ఫోన్‌లో నాగభూషణానికి సమాచారం ఇచ్చారు. ఒరిజినల్ సర్టిఫికెట్ లేకపోవడంతో ఫోర్జరీ సంతకంతో తప్పుడు సర్టిఫికెట్‌ను తయారు చేశారు. అధికారులు పరిశీలించి తహసీల్దార్ మధుకర్ రెడ్డి జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు విచారణ అనంతరం నాగభూషణంపై కేసు నమోదు చేసి శుక్రవారం నాగభూషణంను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు.

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణంలో గురువారం అర్ధరాత్రి పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి ఉన్న నలుగురు వాహనదారులు పట్టుబడ్డారు. నిందితులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ. రెండు వేల చొప్పన జరిమాన విధించారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమాన విధించినట్లు తెలిపారు.

◆ సీపీఎం మహాసభలకు తరలిరండి..

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్లారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, విరాళాలను సేకరించారు. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అడివయ్య, ప్రవీణ్ కుమార్, అశోక్, రమేష్ గౌడ్, శ్రీనివాస్, మల్లేశం, అనిల్. భూషణం, ఏసోబు, బస్వరాజు, బాలయ్య, మోహన్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ ఆన్‌లైన్ నమోదు పరిశీలన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ కుల గణన సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి కొండల్ రావు పరిశీలించారు. డేటా ఎంట్రీ ఎలా జరుగుతుంది, ఒక్కోఫారం ఆన్‌లైన్ నమోదుకు ఎంత సమయం తీసుకుంటుంది తదితతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా డేటా ఎంట్రీ ఆపరేటర్లు వివరాలను నమోదు చేయాలని సూచించారు.

◆ పుస్తక పఠనం అలవర్చుకోవాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని కంజర్ల సమీపంలోని కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పుస్తకాల ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

◆ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తున్నానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని సండే మార్కెట్ బస్సు మార్గంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహీన్‌గౌడ్, పీటర్, ఐలేష్, మల్లేష్ పాల్గొన్నారు.

◆ చేప పిల్లల విడుదల

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిదిలోని మల్కాపూర్ పెద్ద చెరువులో శుక్రవారం మత్స్యశాఖ అదికారులు చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా చైర్మన్ నర్సింలు మాట్లాడుతూ మత్స్యకారులను అభివృద్ధి చేయడంలో భాగంగా గత ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను చెరువులోకి విడుదల చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా చేప పిల్లలను చెరువులలోకి విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది 4 లక్షల 11 వేల చేప పిల్లలను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నగేష్, రమేశ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు

మునిపల్లి(అందోల్): ఎన్యుమరేటర్లు నిర్వహించిన కుటుంబ సర్వేను కంప్యూటర్ యాపరేటర్లు డాటా ఎంట్రీ చేసే సమయంలో సర్వర్ డౌన్ కావడంతో కంప్యూటర్లు అలంకార ప్రాయంగా మారాయి. శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో 24 మంది కంప్యూటర్ ఆపరేటర్లు 15మంది కుటుంబ సర్వే ఫారాలను ఎంట్రి చేస్తున్న సమయంలో సర్వర్ డైన్ అయినట్లు సంబంధిత ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలంలోని పెద్ద ముబారక్‌పూర్‌కు చెందిన భవానీ కిడ్నీవావుతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అత్యవసర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. లక్ష మంజూరుకు సంబంధించి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) జారీ అయ్యింది. శుక్రవారం ఈ ఎల్‌ఓసీని జహీరాబాదు ఎంపీ సురేశ్ షెట్కార్ తన చేతులమీదుగా భవానీ తండ్రి రాములుకు అందజేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ పాల్గొన్నారు.

◆ బూత్‌లెవల్ అధికారులతో సమావేశం

నారాయణఖేడ్: ఖేడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఖేడ్ మండల బూత్ లెవల్ అధికారులతో ఆర్డీఓ అశోక చక్రవర్తి ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈనెల 23, 24వ తేదీల్లో గ్రామాల్లో స్పెషల్ క్యాంపెనింగ్ నిర్వహించి ఓటరు నమోదు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్, 8మంది సూపర్‌వైజర్లు, మండలంలోని 74 మంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.

◆ అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

పటాన్‌చెరు టౌన్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. శుక్రవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అనుమతి మేరకు నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇప్పటికే గ్రామ పరిధిలో అక్రమ నిర్మాణాలకు సంబంధించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

◆ ఆటోను దహనం చేసిన దుండగులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కొత్తపల్లి పరిధిలోని లక్ష్మాపురానికి చెందిన నర్సింలు ఆటోను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. గమనించిన నర్సింలు శుక్రవారం ఉదయం గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆటోపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తన కుటుంబానికి తీరని నష్టం జరిగిందన్నారు. కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

◆ మెరుగైన వైద్య సేవలు అందించాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి వైద్య సిబ్బందిని సూచించారు. శుక్రవారం కల్హేర్ మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు శాతం పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనిల్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ షోయబ్, శ్రీధర్ పాల్గొన్నారు.